

పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ షురూ
కేయూ ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల వారిగా రెండో కేటగిరీ పీహెచ్‌డీలో ప్రవేశాలకు నోటిఫికేషన్లు జారీ చేశారు.
- 8లో



బీరన్నకు ప్రత్యేక పూజలు
వెంకటాపురం(ఎం) మండలంలోని పట్టారిపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో బీరన్నకు ప్రత్యేక పూజలు చేశారు.
- 9లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.0°/21.0°
జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రిపూట చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డయాలసిస్ సెంటర్‌లో ఎల్‌ఈడీ టీవీ



ఏటూరునాగారం: ఏటూరునాగారం సామాజిక వైద్యశాల డయాలసిస్ సెంటర్లో ఎల్‌ఈడీ టీవీని ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ బుధవారం ప్రారంభించారు. మంగపేటకు చెందిన శ్రీధర్‌వర్మ టీవీని బహుకరించగా ఏఎస్పీ ప్రారంభించారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులతో ఏఎస్పీ మాట్లాడారు. సేవలు, వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏర్పడిన ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరికి రక్తం అందిస్తున్నారని డోనర్స్, నిర్వాహకులను ఏఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు వహీద్, గౌరవ సలహాదారుడు ఖాజాపాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఏటూరునాగారం: మండల పరిధిలోని రాంనగర్ ముత్యాలమ్మగుడి వెనుకాల పేకాట ఆడుతున్న శిబిరంపై బుధవారం దాడి చేసి పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి 8 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శిబిరం వద్ద రూ.12, 590నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఏటూరునాగారానికి చెందిన గార గణపతి, రాంనగర్‌కు చెందిన గార గాంధీలను అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ఆరుగురు రాంనగర్‌కు చెందిన గార నగేష్, బొల్లె వెంకటేష్, బొల్లె రాజబాబు, నర్సింగరావు, తోట శ్రీకాంత్, అల్లి లక్ష్మయ్య పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కాళేశ్వరం అర్చకుడికి ఉగాది పురస్కారం



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వరముక్తీశ్వరస్వామి దేవస్థానంలో రుగ్వేద వేద పండితుడు బైకుంఠపాండాకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉగాది పురస్కారాన్ని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా ప్రభుత్వం దేవాలయాల్లోని అర్చకులకు పురస్కారంతో పాటు శాలువాలతో సన్మానించారు. కాళేశ్వరాలయం వేదపండితుడికి అవకాశం దక్కడంతో ఈఓ మహేష్, అర్చక, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి

కాళేశ్వరం: స్టాండింగ్ రూల్స్‌కు వ్యతిరేకంగా గతంలో ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవనం ముట్టడి జరిగిందని, ఈనెల 24న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎన్పీడీసీఎల్ కంపెనీ నిర్వహణ అధ్యక్షుడు నాగుల తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలతో తెలిపారు. ఎన్పీడీసీఎల్ కంపెనీ నుంచి భారీగా విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ ఉద్యోగులు, ట్రాన్స్‌కో, జెన్‌కో, అన్ని విభాగాల కార్మికులు, తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్ 82) ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సంఘీభావ పాదయాత్ర

మొగుళ్లపల్లి: తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజల రాజ్య స్థాపనకై డాక్టర్ విశారదన్ మహరాజ్ చేస్తున్న స్వరాజ్య పాదయాత్రకు సంఘీభావంగా డీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం మొట్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపల్లి వరకు ఐదు కిలోమీటర్ల సంఘీభావ యాత్ర చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ జిల్లా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 90 శాతం ఉన్నటువంటి బీసీ ఎస్సీ ఎస్టీలు తమ సొంత రాజ్యాన్ని నిర్మించుకున్నప్పుడే సకల సమస్యలకు పరిష్కారం ఉంటుందన్నారు. అణగారిన వర్గాల ప్రజలు తమ సొంత రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడం కోసమే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఓటు అనే ఆయుధాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘీభావ పాదయాత్ర జిల్లా ఇన్‌చార్జ్ దూడపాక రాజు మహరాజ్, డీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు మంద రమేష్ మహరాజ్, మండల అధ్యక్షుడు జన్నె లక్ష్మణ్, వార్డు సభ్యురాలు జన్నె రజిత, జన్నె రాకేష్ పాల్గొన్నారు.







వెంకటాపురం(కె)లో వర్షం నీటి నుంచి మిర్చిని ఏరుతున్న రైతులు, నేలవాలిన మొక్కజొన్న పంట(ఫైల్)

రెక్కల కష్టం నేలపాలు

సీఎం సారూ రైతుల గోస చూడండి

- పంట చేతికందే సమయంలో వడగళ్లు, ఈదురుగాలులతో తీరని నష్టం
- ఉమ్మడి వరంగల్‌లో 1,11,702 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- రూ.102కోట్లుగా ప్రాథమిక అంచనా.. రూ.350కోట్లపైనే అంటున్న రైతులు

నేడు పంట నష్టపోయిన గ్రామాల్లో కేసీఆర్ పర్యటన

సాక్షిప్రతినిధి, వరంగల్: అకాల వర్షం.. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులను అతలాకుతలం చేసింది. పంట చేతికందే సమయంలో తీరని నష్టాన్ని మిగిల్చింది. అప్పోసప్పో చేసి పెట్టుబడులు పెట్టిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులు, అకాల, వడగళ్ల వర్షంతో మామిడి కాయలు నేలరాలగా, మొక్కజొన్న తదితర పంటలు కూడా నేలమట్టం అయ్యాయి.

1,11,702 ఎకరాల్లో నష్టం...

ఈనెల 18, 19 తేదీల్లో ఈదురుగాలులు, వడగళ్లతో కురిసిన అకాల వర్షం ఉమ్మడి వరంగల్‌లోని 65 మండలాలపై ప్రభావం చూపింది. స్పందించిన ప్రభుత్వం తక్షణ సాయం కోసం సర్వేకు ఆదేశించింది. ఆయా జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో తిరిగి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మరోవైపు వ్యవసాయ, రెవెన్యూ శాఖలు పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేశాయి. 65 మండలాల్లో వర్షాలు అధిక ప్రభావం చూపగా, 672 గ్రామాల్లో 71,927 మంది రైతులకు చెందిన 1,11,702 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. ఈ మేరకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ములుగు జిల్లా మినహా ఐదు జిల్లాల్లో రూ.102కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. మహబూబాబాద్, జనగామ, పరకాల, నర్సంపేట, భూపాలపల్లి, ఏటూరునాగారం డివిజన్లలో పంటలు బాగా దెబ్బతిన్నట్లు అధికారులు ఆ నివేదికలో పేర్కొన్నారు. అయితే దెబ్బతిన్న పంటల విలువ రూ.350కోట్లపైనే ఉంటుందని రైతులు, రైతు సంఘాల నాయకులు ప్రకటించారు.

రైతన్నకు దెబ్బమీద దెబ్బ..

గతేడాది తెగుళ్లతో సతమతమై కోలుకుంటున్న రైతులకు అకాల వర్షం 'గోరుచుట్టు'పై రోకటిపోటులా మారింది. తెలంగాణ వ్యాప్తంగా ఈ అకాల వర్షాలకు 2.80 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే..



వాజేడు: కల్లంలో చేరిన నీటిని తొలగిస్తున్న రైతులు(ఫైల్)



ఏటూరునాగారంలో తడిసిన మిర్చి ఆరబోస్తున్న రైతులు(ఫైల్)

ఒక్క ఉమ్మడి వరంగల్‌లో 1,11,702 ఎకరాల్లో పంటలు నేలపాలయ్యాయి. 78,628 ఎకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా ధ్వంసం కాగా, 23,093 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. 4,835 ఎకరాల్లో మామిడికాయలు నేలరాలగా, 3,452 ఎకరాల్లో మిరప పంట దెబ్బతింది. మిరప పైరుకు ఈసారి కూడా కొత్త రకం నల్ల తామర పురుగు సోకినందున నివారణ కోసం రైతులు మందులకు విపరీతంగా పెట్టుబడి పెట్టారు. పరిస్థితి చక్కబడడంతో ఎకరానికి సగటున 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావించారు. ఇదే సమయంలో వడగళ్ల వాన రూపంలో పంట నష్టపోవాల్సి వచ్చింది. ఒక్క రైతు ఎకరానికి రూ.లక్ష వరకు అంత కంటే ఎక్కువగానే పెట్టుబడి పెట్టారు. ఎండిన పంట అంచనా వేస్తే ఒక్క ఎకరానికి పెట్టుబడి కలుపుకుని రూ.3,75,000 వరకు రైతు నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

సీఎం కేసీఆర్ పర్యటన ఇలా..

సాక్షి, మహబూబాబాద్/దుగ్గొండి: సీఎం కేసీఆర్ గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం వెల్లడించారు. సీఎం వెంట ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉంటారని తెలిపారు.

ఖమ్మం నుంచి మానుకోటకు..

- **గురువారం మధ్యాహ్నం 12:10 గంటలకు** సీఎం కేసీఆర్ ఖమ్మం నుంచి హెలికాప్టర్ ద్వారా మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం రెడ్డికుంటతండాకు చేరుకుంటారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలిస్తారు. అక్కడ బాధితులతో మాట్లాడుతారు.
- **12.40 గంటలకు :** రెడ్డికుంటతండా నుంచి హెలికాప్టర్ ద్వారా వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవిరంగాపురం గ్రామానికి బయలుదేరుతారు.
- **12.55 గంటలకు :** రంగాపురంలో వర్షాలు, వడగళ్లతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారు. బాధిత రైతులను ఓదారుస్తారు.
- **మధ్యాహ్నం 1.30 :** రంగాపురం నుంచి హెలికాప్టర్‌లో కరీంనగర్ జిల్లాకు బయలుదేరి వెళ్తారు.

హెలిపాడ్‌ల పరిశీలన

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి
- రెడ్డికుంటతండాను సందర్శించిన కలెక్టర్ శశాంక, ఎస్పీ

ఉసురు తీసిన అకాల వర్షం

- పంట నష్టపోయిన రైతు
- అప్పులు తీర్చే మార్గం కనిపించక బలవన్మరణం

- వివరాలు 8లో

జిల్లాల వారీగా అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు (ఎకరాల్లో)

జిల్లా	మండలాలు	దెబ్బతిన్న గ్రామాలు	మొక్కజొన్న	వరి	మామిడి	మిరప	ఇతర పంటలు
హనుమకొండ	14	93	6,606	1,711	304	0	2,500
వరంగల్	13	281	54,424	12,006	583	290	329
భూపాలపల్లి	11	57	2,684	150	57	2,582	77
మహబూబాబాద్	18	158	11,531	4,958	3,705	820	394
జనగామ	9	83	1383	4,268	186	21	133

ములుగులో పంచాంగం వింటున్న స్థానికులు



ఘనంగా ఉగాది

- శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు

ములుగు: జిల్లా ప్రజలు శోభకృత్ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. షడ్రుచులతో చేసిన ఉగాది పచ్చడిని సేవించారు. జిల్లా కేంద్రంలోని శివాలయం, రామాలయం, రామప్ప, మల్లూరు, గట్టమ్మ ఆలయం, మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయాల పూజారులు ఆలయాలను శుద్ధి చేయగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు సాంప్రదాయ పద్ధతిలో పాడి పశువులు, ట్రాక్టర్లను పూజించి నాగళ్లతో తొలిసాలు తీశారు. సాయంత్రం ఆలయాల్లో నిర్వహించిన పంచాగ శ్రవణానికి స్థానికులు అధిక సంఖ్యలో హాజరై తమతమ పేర్ల మీద ఆదాయం, ఖర్చు, రాజపూజ్యం, అవమానం వంటి జాతకాలను చూపించుకున్నారు. అదే విధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. కార్యకర్తలు, ముఖ్య నాయకులకు ఎమ్మెల్యే సీతక్క శుభాకాంక్షలు తెలిపి, ఉగాది పచ్చడి తినిపించారు. సీతక్క వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, నల్లెల భరత్‌కుమార్, జక్కుల రేవంత్‌యాదవ్, ఆలోత్ దేవ్‌సింగ్ తదితరులు ఉన్నారు.



నాగలితో సాలు తీస్తున్న రైతు తిరుపతిరెడ్డి

ఐదురోజుల ఉగాది

వాజేడు: విశ్వకర్మలు ఐదురోజుల ఉగాది పండుగను మడి బట్టలతో ప్రారంభించారు. ఇంట్లో పెరుమాల్లు(పందిరి)ని సీతాఫలం పుల్లలతో వేసి, మోదుగ పూలు, మామిడాకు తోరణాలను కట్టారు. తమ కుల వృత్తికి సంబంధించిన పని ముట్లను పూజలో ఉంచారు. వీరబ్రహ్మేంద్ర స్వామితో పాటు పసుపుతో తయారు చేసిన గౌరమ్మను మిగతా దేవుళ్ల ఫొటోలను పూజలో ఉంచారు. ఈ పూజలను విశ్వకర్మలు ఉపవాసంతో నిర్వహించారు.



వాహనపూజ చేస్తున్న రైతు



వాజేడు: పూజ చేస్తున్న విశ్వకర్మలు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ములుగు రూరల్(గోవిందరావుపేట): వడగళ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. గోవిందరావుపేట మండల పరిధిలోని పలు మామిడి తోటలు, వరి పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లవాగు శివారులో మామిడి, వరి, మిర్చి పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. చేతికి వచ్చిన పంటలు అకాల వర్షాలకు నేలమట్టం కావడంతో రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారని తెలిపారు. వ్యవసాయం, హార్టికల్చర్ అధికారులు సర్వే నిర్వహించి పంటనష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు. లేని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, గుండు రామస్వామి, సామ చంద్రారెడ్డి, భూక్య మిట్ నాయక్, పాలిత్య బాలు, మూడు రాజునాయక్, మాలోత్ గాంధీ, అజ్మీర కొమ్మాలు, అజ్మీర దుర్గ, భూక్య మార్క్ తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న నాయకులు

రైతులకు సన్మానం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు కొనసాగిన బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల వాహనాల పార్కింగ్ కోసం వ్యవసాయ భూములను కల్పించిన రైతులను బుధవారం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాలుగు చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామన్నారు. అది పూర్తిగా రైతుల సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల సహకారంతో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. జాతర విజయవంతానికి కృషి చేసిన రైతులు సాంబయ్య, పోగు సమ్మయ్య, సింగరి పసమ్మ, కరుణాకర్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

కోట్లు కొల్లగొట్టారు..

ఇసుక అక్రమ రవాణాలో పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల లారీలే..

- టీఎస్‌ఎండీసీ సిబ్బందితో వే బ్రిడ్జిల నిర్వాహకులు సైతం కుమ్మక్కు
- వే బిల్లులు, డీడీలు లేకుండానే వందలాది లారీల ఇసుక తరలింపు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పెట్టిన వైనం

ఏటూరునాగారం: ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన కోట్లాది రూపాయలను అక్రమార్కులు కొల్లగొట్టారు. ఇసుక అక్రమ రవాణాలో పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇసుక క్వారీలను నడుపుతున్న కాంట్రాక్టర్లు.. భాగస్వాముల లారీలే అధికంగా ఉన్నాయి. దీంతో ఆ లారీలను నేరుగా క్వారీలకు పంపించి వే బిల్లులు, డీడీలు లేకుండానే ఇసుకను తరలించే విధంగా అక్రమార్కులు పక్కా ప్లాన్ చేశారు. ఇందులో భాగంగానే వాజేడు, వెంకటాపురం(కె), మంగపేట, మణుగూరు తదితర ప్రాంతాల్లో ఉన్న 24 క్వారీల నుంచి వందలాది లారీల ఇసుక తరలివెళ్లింది.

నిబంధనలు ఇలా..

గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని గిరిజనులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌ఎండీసీ ద్వారా గోదావరిలో ఇసుక ఉన్న ప్రాంతాలను గుర్తించింది. వాటిని మండల, డివిజన్, జిల్లా స్థాయి కమిటీల ద్వారా తీర్మాణాలను చేసి స్థానికంగా ఉన్న గిరిజనులను సొసైటీగా ఫాం చేసి ఇసుక క్వారీలను ఏర్పాటు చేసింది. అయితే సొసైటీల వద్ద క్వారీలను నడిపేంత పెట్టుబడి వారికి లేకపోవడంతో ప్రభుత్వం రేజింగ్ కాంట్రాక్టర్లను క్వారీ వ్యాపారంలోకి భాగస్వాములు చేసింది. కాంట్రాక్టర్ గోదావరిలో ఉన్న ఇసుకను కూలీల ద్వారా ట్రాక్టర్లలో తరలించి డంపింగ్ యార్డులో నిల్వ చేయడమే సొసైటీల సభ్యులు చేయాలి. కాంట్రాక్టర్ పని మాత్రం డంపింగ్‌యార్డులో ఉన్న ఇసుకను టీఎస్‌ఎండీసీ సిబ్బంది ఆన్‌లైన్‌లో తీసుకున్న డీడీని స్వీకరించి ఆ పరిమాణంతో ఇసుకను లోడింగ్ చేసి వే బిల్లు అందించాల్సి ఉంటుంది. కేవలం కాంట్రాక్టర్ డంపింగ్ యార్డులో ఉన్న ఇసుకను టిప్పర్, లారీల్లో లోడింగ్ చేసుకోవడానికి మాత్రమే అనుమతి ఉంది.

గోదావరిలోకి తీసుకెళ్లి..

అయితే ఇక్కడ డంపింగ్ చేసే కాంట్రాక్టర్లు తన, భాగస్వాములకు చెందిన లారీలను నేరుగా గోదావరిలోకి తీసుకెళ్లి అక్కడే లోడింగ్ చేయించుకొని టీఎస్‌ఎండీసీ సిబ్బందికి ముడుపులు అప్పగించి హైదరాబాద్, ఇతర పట్టణాలకు తరలించుకుపోవడం గమనార్హం. కోట్లాది రూపాయల ప్రభుత్వ ఖజానాకు గండిపెట్టి ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు, లారీల యజమానులు, టీఎస్‌ఎండీసీ అధికారులు, సిబ్బంది పంచుకుతిన్నారు. ముఖ్యంగా గోదావరి నదిలో ఇసుకను తోడే అనుమతి జేసీబీ, పొక్లెయినర్లకు లేదు. కానీ టీఎస్‌ఎండీసీ, పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకుల అండతో నేరుగా గోదావరిలోనే జేసీబీ, పొక్లెయిన్లు పెట్టి ఇసుకను తోడారు.

పోలీసులు, ప్రభుత్వ అధికారులు

ఇసుక క్వారీ వ్యాపారంలో కోట్ల రూపాయలు గడించవచ్చని అత్యాశకు పాల్పడి కొంత మంది పోలీసులు బినామీ పేర్లతో లారీలను కొనుగోలు చేశారు. వాటిని ఇసుక క్వారీల వద్దకు పంపించి ఫోన్లలో చెప్పించుకొని ఇసుకను డీడీలు, వే బిల్లులు లేకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులే కాకుండా ఇతర శాఖల్లో పనిచేసే మరికొంత మంది ఉద్యోగులు కూడా లారీలను ఇసుక క్వారీల్లో పెట్టి వ్యాపారాన్ని కొనసాగించడం విస్మయాన్ని కలిగిస్తోంది.

వే బ్రిడ్జిల నిర్వాహకులతో..

ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి, ధర్మారం, వెంకటాపురం(కె) వద్ద ఉన్న వే బ్రిడ్జిల నిర్వాహకులు సైతం ఇసుక లారీలు, కాంట్రాక్టర్లు, టీఎస్‌ఎండీసీ సిబ్బందితో కుమ్మక్కు అయ్యారు. లారీల్లో అధిక లోడు, వే బిల్లులు లేకున్నా కూడా ముడుపులు అధికంగా తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరించారు. ఇందులో భాగంగానే ఇటీవల చిన్నబోయినపల్లికి చెందిన రాజశేఖర్ నకిలీ వే బిల్లుల కుంభకోణంలో పట్టుబడ్డారు.

లోడింగ్‌కు రూ.3,500లు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక క్యూబిక్ మీటర్ ఇసుక కొనుగోలు చేసే వ్యక్తి రూ.600లు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంది. సుమారు పది క్యూబిక్ మీటర్ల ఇసుకకు రూ. 6వేలు చెల్లించాల్సి ఉంటుంది. అందులో డంపింగ్ యార్డులో ఉన్న ఇసుకను టిప్పర్, లారీల్లో లోడింగ్ చేసేందుకు సొసైటీ సభ్యులు రేజింగ్ కాంట్రాక్టర్‌కు రూ.226లు ఒక క్యూబిక్ మీటర్‌కు చెల్లించాల్సి ఉంది. కానీ నిబంధనలను అతిక్రమించి కాంట్రాక్టర్లు అదనంగా రూ. 3,500లు కేవలం లోడింగ్ చేసేందుకు తీసుకొని లారీలను పంపించడం గమనార్హం. ఈ విషయాన్ని లారీల డ్రైవర్లు టీఎస్‌ఎండీసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయింది.



మాట వినకుంటే బదిలీనే..

ఇసుక క్వారీల్లో పనిచేసే స్యాండ్ రీచ్ ఆఫీసర్లు ఏపీఓ శంకరయ్య మాట వినకుంటే ఎలాంటి లాభం లేని ఇసుక క్వారీలకు బదిలీ చేయడం పరిపాటిగా మారుతోంది. ఇసుక లభ్యత లేని ప్రాంతాలకు సిబ్బందిని తరలించడం ఆయనకు ఆయనే సాటి. సిబ్బంది చెప్పినట్లుగా కమీషన్లు తీసుకొని అందులో కొంత అప్పగించాల్సిందే. అలా అయితేనే ఆ క్వారీలో ఆ సిబ్బంది కొనసాగుతారు.

ఆర్టీసీ కార్మికుల సేవలు వెలకట్టలేనివి



కండక్టర్లను సన్మానిస్తున్న రాజేందర్, నాయకులు

భూపాలపల్లి రూరల్: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల సేవలు వెలకట్టలేమని, బీజేపీ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ సెంటర్‌లో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు దసరా, దీపావళి, సంక్రాంతి, రాఖీ, ఉగాది పండుగ వేళల్లో కుటుంబంతో సంతోషంగా గడపాల్సిన క్షణాలను దూరం చేసుకొని, ప్రజలే తమ కుటుంబంగా భావించి, విధిలో భాగంగా ప్రయాణికులను తమ గమ్యాలకు చేరవేస్తుంటారన్నారు. ఆర్టీసీ చార్జీలు పెరిగిన వీరికి జీతాలు మాత్రం పెరగవన్నారు. ఎంత ఒత్తిడిలో ఉన్నప్పటికీ వీరు సహనంతో విధులు నిర్వహిస్తుంటారన్నారు. ఆర్టీసీ కార్మికులను గౌరవంతో చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఊనుకొండ రామకృష్ణ, అజ్మీరా రాజు, గీస సంపత్, కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో పడి ఒకరి మృతి



రాములు (ఫైల్)

గూడూరు: మండలంలోని దామరవంచకు చెందిన పొడుగు రాములు ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం గ్రామ సమీపంలోని చెరువులో శవమై కనిపించాడు. రాములు కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఇంటి నుంచి వెళ్లిపోయిన అతడి కోసం భార్య పద్మ, కుటుంబీకులు చుట్టుపక్కలా వెతికారు. ఎంతకూ ఆచూకీ దొరకలేదు. చివరికి గ్రామ సమీపంలోని చెరువులో శవమై కనిపించాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్‌గౌడ్ తెలిపారు. మతిస్థిమితం కోల్పోయి చెరువులో పడి చనిపోయిన నిరుపేద రాములు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సర్పంచ్ ధరావత్ కొమ్మాలు కోరారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



వాలి(ఫైల్)

కాశిబుగ్గ: నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు(12656) ఢీకొని నెక్కొండ మండలం మడిపల్లికి చెందిన భూక్య వాలి(88) మంగళవారం రాత్రి మృతి చెందినట్లు జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మడిపల్లి ఎల్‌సీ గేట్ 78 ఈ సమీపంలో అప్‌లైన్‌లో రైల్వే ట్రాక్ దాటుతుండగా నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతురాలి బంధువులకు అప్పగించామని సీఐ నరేశ్ తెలిపారు.

వాగులో గల్లంతైన రైతు మృతదేహం లభ్యం



మొగిలయ్య మృతదేహం

చిట్యాల: మండలంలోని వెంచరామి శివారులోని మొరంచవాగు దాటుతుండగా.. ప్రమాదవశాత్తు వెంచరామికి చెందిన రైతు ఒడ్డారపు మొగిలయ్య గల్లంతైన విషయం తెలిసిందే కాగా.. బుధవారం మొగిలయ్య మృతదేహం లభ్యమైంది. పొలం పనుల కోసం మంగళవారం తోటి రైతులతో కలిసి వాగు దాటుతుండగా.. ప్రమాదవశాత్తు వాగులో పడి గల్లంతయ్యాడు. ఈక్రమంలో వాగులో మొగులయ్య మృతదేహం కోసం గ్రామస్తులు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గాలింపు చర్యలు చేపట్టగా.. బుధవారం మృతదేహం లభ్యమైంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు.

అప్పటికే రోడ్డును ఆక్రమించుకున్న ప్రహరీ నిర్మాణాన్ని అనుకుని రోడ్డుపైనే నిర్మించిన బస్ షెల్టర్



రోడ్డుపైనే బస్‌షెల్టర్

- అప్పటికే రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకున్న లీజ్ సంస్థ
- 100 ఫీట్ల రోడ్డు స్థలాన్ని వదిలి లీజ్ అగ్రిమెంట్ చేసుకున్న ఆర్టీసీ
- బస్‌షెల్టర్ నిర్మాణంతో మరింత ఇరుకుగా రోడ్డు
- పట్టింపు లేని వరంగల్ మహానగరపాలక సంస్థ

హన్మకొండ: వరంగల్ మహానగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టింపులేని తనం, బాధ్యతారాహిత్యం వెరసి కాంట్రాక్టర్ తనకు నచ్చిన రీతిలో బస్‌షెల్టర్‌లు నిర్మించుకుంటూ వెళ్తున్నాడు. ఇదే క్రమంలో హనుమకొండ అంబేడ్కర్ కూడలినుంచి ఎన్జీవోస్ కాలనీ రోడ్డులో ఆర్టీసీ హనుమకొండ డిపో ఎదుట నిర్మించిన బస్‌షెల్టర్‌తో రోడ్డు కుదించుకుపోయింది. ఎదురెదురుగా నిర్మించిన ఈ బస్ షెల్టర్‌ల స్థానంలో రెండు వైపుల బస్సు నిలిపితే ట్రాఫిక్ జామ్‌కానుంది.

హనుమకొండ బస్ డిపో ఎదుట ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల నివాస గృహాల స్థలాన్ని హైదరాబాద్‌కు చెందిన జూల్లీ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ 33 సంవత్సరాల లీజుకు దక్కించుకుంది. ఇక్కడ ఆర్టీసీ స్థలం 4,638 చదరపు అడుగులు ఉండగా, ఇందులో 100 ఫీట్ల రోడ్డు వెడల్పుగాను ఆర్టీసీ ముందుగానే 1,138.48 అడుగుల స్థలాన్ని వరంగల్ మహానగర పాలక సంస్థకు మార్టిగేజ్ చేసింది. మిగిలిన 3,464.5 చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు ఇచ్చింది. సదరు లీజ్ సంస్థ రోడ్డును సైతం ఆక్రమించి ప్రహరీ నిర్మించినా బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో పెద్దల హస్తం ఎవరిదైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్న కొద్దిస్థలంలో బస్‌షెల్టరా?

లీజ్ సంస్థ ఇప్పటికే కొంత ఆక్రమించి ప్రహరీ నిర్మించగా రోడ్డుకు అనుకుని మరీ బల్దియా అధికారులు బస్‌షెల్టర్‌నిర్మించారు. రోడ్డుకు అవతల వైపు మరో షెల్టర్‌ఉంది. ఒకేసారి ఇక్కడ బస్సులు ఆపితే ఎవరూ వెళ్లలేని పరిస్థితి. దీని వల్ల రోడ్డు ఇరుకుగా తయారై ప్రమాదాలు జరిగే అవకాశమున్న ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. వరంగల్ మహానగరం ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతకు ప్రత్యేకంగా వరంగల్ పోలీస్ కమిషనర్ నేతృత్వంలో రోడ్డు భద్రతా కమిటీ ఉంది. ప్రధాన రోడ్లు ఆక్రమణకు గురై ప్రమాదాలు జరిగే అవకాశమున్నా.. ఈ కమిటీ పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డును ఆక్రమించారు..



ఆర్టీసీ స్థలం లీజుకు తీసుకున్న వారు రోడ్డును ఆక్రమించి ప్రహరీని నిర్మించారు. మేము అభ్యంతరం చెప్పినా వినిపించుకోకుండానే ప్రహరీ నిర్మించారు. దీంతో రోడ్డు ఇరుకుగా తయారైంది. ప్రహరీని అనుకుని బస్‌షెల్టర్ నిర్మించడంతో రోడ్డు మరింత కుదించుకుపోయింది. అధికారులు స్పందించి వెంటనే ప్రహరీని తొలగించి రోడ్డును 100 ఫీట్ల వెడల్పు చేయాలి.

– జి.బాలు, గోకుల్‌నగర్

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..



రోడ్డు ఆక్రమణపై గ్రేటర్ అధికారులకు స్వయంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గ్రీవెన్స్ సెల్‌లో మరోసారి ఫిర్యాదు చేసినా స్పందన లేదు. అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. వరంగల్ పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి.

– బొంగు రాజు, గోకుల్‌నగర్

సీఎం పర్యటనకు హెలిపాడ్‌ల పరిశీలన



పెద్దవంగర: ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్



దుగ్గొండి: అడవిరంగాపురంలో హెలిపాడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు పెద్ది, చల్లా

సంగెం/దుగ్గొండి/గీసుకొండ: సీఎం కేసీఆర్ గురువారం సంగెం, దుగ్గొండి, గీసుకొండ మండలాల్లో పర్యటించనున్న నేపథ్యంలో హెలిపాడ్, రూట్ మ్యాప్‌లను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. సంగెం మండలం పల్లారుగూడ, వంజరపల్లి దుగ్గొండి మండలం అడవి రంగాపురం గ్రామాల్లో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను సీఎం పరిశీలించనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని పైలాన్ సమీపంలో హెలిపాడ్ వద్దకు సీఎం చేరుకుంటారు. దారిపొడవునా ఉన్న పంట పొలాలను సీఎం పరిశీలించే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా అధికారులు, పోలీసులకు సూచనలిచ్చారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఈస్ట్‌జోన్ డీసీపీ పి.కరుణాకర్, మామునూరు, నర్సంపేట ఏసీపీలు కృపాకర్, సంపత్‌రావు, గీసుకొండ, పర్వతగిరి సీఐలు నట్ల రాజు, శ్రీనివాస్, సంగెం జెడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి, ఏనుమాముల మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ నిమ్మగడ్డ వెంకన్న, కందకట్ల నరహరి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, మాజీ వరంగల్ మార్కెట్ చైర్మన్ చింతం సదానందం, ఇన్‌చార్జ్ ఆర్డీఓ మహేందర్‌జీ, డీసీపీ కరుణాకర్, ఏసీపీ సంపత్‌రావు, దుగ్గొండి, సంగెం మండలాల బీఆర్ఎస్ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కాట్ల కోమల, వైస్ ఎంపీపీ జైపాల్‌రెడ్డి, సర్పంచ్ కొండం రమాదేవి, ఎంపీటీసీ పిండి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

పెద్దవంగర: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను సీఎం కేసీఆర్ గురువారం పరిశీలించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం మండలంలోని బొమ్మకల్లు, పోచారం, రెడ్డికుంట తండాల్లో ఏర్పాట్లను కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కాగా.. పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ షురూ

కేయూ క్యాంపస్: కేయూలో ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ, లా, సైన్స్ ఎడ్యుకేషన్ విభాగాల వారీగా రెండో కేటగిరీ పీహెచ్‌డీలో (2021–22) ప్రవేశాలకు ఆయా విభాగాల డీన్‌లు వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకొని తమ రీసెర్చ్ ప్రపోజల్స్‌తో దరఖాస్తులను ఆయా విభాగాల వారీగా డీన్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అన్ని విభాగాల డీన్‌లు కూడా వేర్వేరుగా జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం.. ఏప్రిల్ 10 వరకు దరఖాస్తులు అభ్యర్థులు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.800, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగ అభ్యర్థులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కాగా.. ఆర్ట్స్ డీన్‌గా తెలుగు విభాగాధిపతి ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు, సైన్స్ విభాగం డీన్‌గా పి.మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్‌గా విజయబాబు, ఫార్మసీ డీన్‌గా నర్సింహారెడ్డి, ఇంజనీరింగ్ డీన్‌గా టి.శ్రీనివాసులు, లా డీన్‌గా ఉస్మానియా యూనివర్సిటీ విద్యావిభాగం ఆచార్యులు విజయలక్ష్మి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం డీన్‌గా కె.రాజిరెడ్డి, విద్యా విభాగం డీన్‌గా రాంనాథ్ కిషన్ బాధ్యతలను నిర్వర్తిన్నారు. డీన్‌లతో కూడిన కమిటీలతో అడ్మిషన్ల ప్రక్రియ జరగనుంది.

26న 'తెలంగాణ బచావో' సదస్సు

- తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ వెంకటనారాయణ

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 26న హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో తెలంగాణ బచావో-సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఆచార్య కె.వెంకటనారాయణ బుధవారం తెలిపారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ ప్రస్తుతం ఆధిపత్య పాలన కింద నలుగుతోందన్నారు. ప్రజాస్వామిక సామాజిక తెలంగాణను నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని, తెలంగాణ ఉద్యమంలో తొలి, మలిదశ ఉద్యమకారుల వేదిక ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసదస్సులో ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ ఇ.తిరుమలి, అరుణోదయ విమలక్క, సంగంరెడ్డి పృథ్వీరాజ్, తొలి వెలుగు రఘు, తెలంగాణ విఠల్, కేయూ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు టి.శ్రీనివాస్, టీఎస్ఐఎంఏ అధ్యక్షుడు కాశీప్రసాద్ వివిధ సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల బాధ్యులు పాల్గొననున్నట్లు వెంకటనారాయణ తెలిపారు. ఈసదస్సును తెలంగాణ ఉద్యమకారులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నాటుకోళ్లతో నష్టాలకు చెక్!

- నాటు కోళ్ల పెంపకంలో రాణిస్తున్న రైతు
- సబ్సిడీ రుణాలందించాలని వేడుకోలు



చెన్నారావుపేట: పోయిన చోటే వెతుక్కోవాలనుకున్నాడు. వరుసగా రెండేళ్ల వ్యవసాయంలో నష్టాలు రావడంతో తమ పూర్వీకులు గతంలో ఇంటి ఆవరణలో పెంచుకున్న కోళ్ల పెంపకం అతడికి గుర్తుకొచ్చింది. ప్రస్తుతం ఫామ్ కోళ్ల కంటే నాటు కోళ్లకు, కడక్‌నాథ్ కోళ్లకు డిమాండ్ ఉండడంతో వ్యవసాయంతో పాటు నాటు కోళ్లపై దృష్టి పెట్టాడు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన రైతు కాట కుమారస్వామి.

నష్టం నుంచి లాభాల్లోకి..

కుమారస్వామి మూడెకరాల్లో వ్యవసాయం చేసేవాడు. మిర్చి, మొక్కజొన్న, పత్తి పంటలతో పాటు పలు రకాల పంటలు పండించేవాడు. గత రెండేళ్లుగా పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు వైరస్, చీడ పురుగులతో తీవ్రంగా నష్టపోయాడు. దీంతో సమాజంలో నాటు కోళ్లకు ఉన్న డిమాండ్‌తో ఇంటి ఆవరణలో షెడ్ ఏర్పాటు చేసుకున్నాడు.

మొదటి విడతలో..

గతేడాది జూన్‌లో హైదరాబాద్ నుంచి 500 కోడి పిల్లలు తెచ్చి పెంచాడు. కోడి పిల్లలకు, వాటికి దాణా ఖర్చులు నాలుగు నెలలకు రూ.70 వెచ్చించాడు. వాటిని విక్రయిస్తే రూ.1.30 లక్షలు వచ్చాయి.

పెరిగిన కోళ్ల పెంపకం..

మొదటిసారిగా ప్రయత్నం చేసి లాభాలు రావడంతో ఇంటి వద్ద ఉన్న షెడ్‌తో పాటు వ్యవసాయ బావి వద్ద మరో షెడ్ వేశాడు. అప్పటి నుంచి నెలకు ఒక బ్యాచ్ (500 పిల్లలు) చొప్పున తెచ్చి ఇప్పటి వరకు ఏడు బ్యాచ్‌ల కోళ్లు విక్రయించాడు. నాటు కోళ్లతో పాటు సుమారు 100 వరకు కడక్‌నాథ్ కోళ్లు తెచ్చి విక్రయించాడు. మార్కెట్‌లో నాటు కోళ్లకు రూ. 250 నుంచి రూ. 500 వరకు డిమాండ్ ఉంది. కడక్‌నాథ్ కోళ్లకు రూ.600 నుంచి రూ. 2,000 వరకు ధర పలుకుతోంది.

రుణమిస్తే పెంచుతా..



ప్రభుత్వం సబ్సిడీ రుణాలందిస్తే కోళ్ల పెంపకం చేపడతా. నాతో పాటు మరి కొంత మందికి ఉపాధి కల్పిస్తా. నాకున్న నదుపాయాలతో షెడ్ వేసుకుని నాటు కోళ్లు పెంచుతున్నా. ఉపాధిహామీలో షెడ్డు మంజూరు ఇవ్వాలి. నాటు కోళ్లు పెంచుతున్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి.

– కాట కుమారస్వామి, నాటు కోళ్ల పెంపకందారుడు, జల్లి

రూ. 600లకు 25 కోడి పిల్లలు



ప్రభుత్వం పశు సంవర్థక శాఖ ద్వారా నాటు కోళ్లు పెంచుకోవాలనే మహిళా రైతులకు 600 డీడీ తీసి ఇస్తే రాజ్ శ్రీ రకం కోడి పిల్లలను అందిస్తాం. పూర్తి వివరాలకు పశు వైద్యాధికారులను సంప్రదించాలి.

– డాక్టర్ మంజులాల్

కుక్కకాటుతో వృద్ధుడికి గాయాలు



దిల్వారు: మండలంలోని ఫతేపూర్‌కు చెందిన మార్క వెంకటయ్యపై కుక్క దాడి చేసి కరవడంతో కాలుకు తీవ్రగాయమైంది. రోజూ మాదిరిగానే వెంకటయ్య బుధవారం వ్యవసాయ బావి వద్దకు నడుస్తూ వెళ్తుండగా.. ఒక్కసారిగా రెండు కుక్కలు వెంటపడ్డాయి. వాటిని తరిమేలోపే కాలును కరిచింది.


భార్య అలిగి వెళ్లిందని వృద్ధుడి ఆత్మహత్య



ఎల్లయ్య(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: భార్య అలిగి వెళ్లిందని స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండకు చెందిన పసుల ఎల్లయ్య(70) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్లయ్య, ఉప్పలమ్మ దంపతులు వారి కుమారుడు, కోడలు, మనువడు, మనువరాళ్లతో కలిసి నివాసం ఉంటున్నారు. మూడ్రోజుల క్రితం ఎల్లయ్యకు, అతడి భార్య ఉప్పలమ్మ మధ్య చిన్న తగాదా జరిగింది. దాంతో ఆమె అలిగి గ్రామంలోని ఇతరుల ఇంటికి వెళ్లింది. మూడ్రోజులుగా.. భార్య ఇంటికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన వృద్ధుడు మంగళవారం రాత్రి బహిర్భూమికి వెళ్తానని చెప్పి ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం వారి పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని శవమై కనిపించాడు. కాగా.. భార్య పట్టించుకోవడం లేదని క్షణికావేశంతో ఎల్లయ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అతడి కుమారుడు పసుల వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

చెరువులో పడి ఒకరు..



షేక్ ఖాదర్ మృతదేహం

జఫర్‌గఢ్: చెరువులో పడి మండలంలోని కూనూర్ గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ (48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఖాదర్ కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా ఒంటరిగా ఉంటూ, పెళ్లి కావడం లేదని తీవ్ర మనస్తాపానికి లోనయ్యేవాడు. ఈనేపథ్యంలో షేక్ ఖాదర్ ఆత్మహత్య చేసుకున్నట్లు అతడి స్నేహితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు స్థానిక ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు.

పండుగ పూట విషాదం

పండుగకు ఇంటికొస్తూ ఒకరు. అకాల వర్షంతో పంట నష్టపోయిందని మరొకరు. కరెంటు ప్రసరిస్తుందని ముందే భార్య చెప్పినా.. వినిపించుకోక మాంసాన్ని తీగపై ఆరేస్తూ ఇంకొకరు.. ఇలా వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందారు. ఉగాది పండుగ పూట ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

ఉసురు తీసిన అకాల వర్షం

- పంట నష్టపోయిన రైతు
- అప్పులు తీర్చే మార్గం కనిపించక ఆత్మహత్య



కుమారస్వామి (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల కురిసిన అకాల వర్షాలు ఓ రైతు ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. వడగండ్ల వానలతో పంటలు నేలవాలాయి. దీంతో సాగు పెట్టుబడులకు చేసిన అప్పు తీర్చే మార్గం రైతుకు కనిపించకుండా పోయింది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌కు చెందిన దండబోయిన కుమారస్వామి(50) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారస్వామికి ఆరెకరాల భూమి ఉంది. మరో ఆరెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాడు. పంటల సాగు కోసం బ్యాంకు నుంచి దాదాపు రూ.8 లక్షలు, బయట దాదాపు రూ.3 లక్షలు అప్పు చేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతుకు చెందిన మొక్కజొన్న, వరి పంటలు నేలవాలాయి. పెట్టుబడికి అప్పు చేసి ఆరుగాలం పండించిన పంటలు అకాల వర్షంతో నష్టపోవడం, అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో రైతు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం వ్యవసాయ బావి వద్ద క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని కుమారుడు హరీశ్‌కు ఫోన్ చేసి చెప్పడంతో కుటుంబీకులు అక్కడికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న కుమారస్వామిని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కుమారస్వామి మృతి చెందాడు. ఉగాది పండుగ రోజే రైతు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

నిర్లక్ష్యమే అతడి ప్రాణం తీసింది!

- షాక్ వస్తుందని ముందే చెప్పిన భార్య
- పోతుల్ని బలిచ్చిన తెల్లారే కరెంటుకు బలయ్యాడు!



దేవేందర్ మృతదేహం

నెల్లికుదురు: 'తీగకు కరెంట్ షాక్ వస్తున్నట్లు ఉంది' అని ముందే భార్య చెప్పింది. పెడచెవిన పెట్టిన అతడు చివరికి కరెంట్ షాక్‌తోనే మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కాచికల్ గ్రామ శివారు తిమ్మతండా తండాకు చెందిన గుగులోతు దేవేందర్(35) బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. తిమ్మతండాలో మంగళవారం దుర్గమ్మ పండుగ జరుపుకున్నారు. దేవేందర్ ఇంటికి బంధువులు రావడంతో రెండు గొర్రెపోతులను దుర్గమ్మ ఆలయం వద్ద బలిచ్చాడు. బంధువులతో సంతోషంగా పండుగ జరుపుకున్నాడు. బుధవారం మిగిలిన మాంసాన్ని ఇంటి ముందు ఉన్న తీగపై ఆరేస్తుండగా.. ప్రమాదవశాత్తు తీగకు విద్యుత్ ప్రసరించి షాక్‌కు గురయ్యాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే దేవేందర్ మృతి చెందాడు. కాగా.. తీగకు కరెంట్ షాక్ వస్తున్నట్లు ఉందని మూడ్రోజుల క్రితమే దేవేందర్ భార్య సావిత్రి గుర్తు చేసినప్పటికీ అతడు పట్టించుకోలేదు. నిర్లక్ష్యమే అతడి ప్రాణం తీసిందని తండావాసులు, కుటుంబీకులు రోదించిన తీరు కంట తడి పెట్టించింది. భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రాణాప్రతాప్ ఎస్సై తెలిపారు.

పండుగకు ఇంటికొస్తూ పరలోకాలకు



సేమ్యా మృతదేహం

యాదగిరిగుట్ట రూరల్: పండుగకు స్వగ్రామానికి వెళ్తూ బుధవారం యాదాద్రి జిల్లా యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం గ్రామం స్టేజీ సమీపంలో హైదరాబాద్ – వరంగల్ ప్రధాన జాతీయ రహదారిపై మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన అజ్మీర సేమ్యానాయక్(22) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అజ్మీర వెంకన్న, కళ దంపతుల కుమారుడు సేమ్యా. వీరు హైదరాబాద్‌లో కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉగాది పండుగకు స్వస్థలమైన మహబూబాబాద్ జిల్లాకు వెళ్లేందుకు వెంకన్న భార్యను హైదరాబాద్‌లో బస్సు ఎక్కించాడు. అనంతరం వెంకన్న తన కుమారుడు సేమ్యా కలిసి బైక్‌పై బయల్దేరారు. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం గ్రామం స్టేజీ పరిధిలోనికి రాగానే.. కల్వర్టును అతి వేగంతో ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న అజ్మీర సేమ్యా(22) అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి.